సాక్షి రాజన్న సిరిసిల్ల

శనివారం । 22 । ఫిబ్రవరి । 2025

మహాశివరాత్రి ఉత్సవాలకు రండి..



వేములవాడ: దక్షిణకాశీ వేములవాడ రాజన్న సన్నిధిలో ఈనెల 25 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించుకునే మహాశివరాత్రి జాతర మహోత్సవాలకు హాజరు కావాల్సిందిగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్‌లను ఆలయ ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి ఆహ్వానించారు. అధికారులు, అర్చకులు సిరిసిల్ల చేరుకుని వారికి ఆహ్వానపత్రికలు, స్వామి వారి ప్రసాదాలు అందజేశారు.



న్యూస్‌రీల్

సమయపాలన పాటించాలి

- సీడీపీవో ఉమారాణి



మాట్లాడుతున్న సీడీపీవో ఉమారాణి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్లు, ఆయాలు సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సీడీపీవో ఉమారాణి హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్‌లో శుక్రవారం రెండు మండలాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో సమావేశమయ్యారు. సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలను శ్రద్ధతో చూసుకోవాలన్నారు. వంట చేసేటప్పుడు శుభ్రత పాటించాలని సూచించారు. సూపర్‌వైజర్లు గుమ్మడి కళావతి, సంతోషి పాల్గొన్నారు.

కక్షసాధింపు కరెక్టు కాదు

- బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే.. వారి వెంటే ఉంటామని, మంచి పనులు చేస్తే సహకారం అందిస్తామని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేర్కొన్నారు. ఇటీవల జిల్లాలో జరుగుతున్న కక్షసాధింపు చర్యలపై శుక్రవారం వేములవాడలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రధాన ప్రతిపక్షపార్టీగా ప్రజల పక్షాన ఎల్లప్పుడూ కొట్లడుతామన్నారు. కలెక్టర్‌తోపాటు మిగతా అధికారులందరూ ఎవరి కనుసన్నల్లో పనిచేస్తున్నారో జిల్లా ప్రజలు గమనిస్తున్నారన్నారు. కలెక్టర్ అనాలోచిత నిర్ణయంతో లక్ష మంది పాడిరైతులు ఇబ్బంది పడ్డారన్నారు. మిల్క్‌చిల్లింగ్ సెంటర్ మూసివేయడంతో రూ.10లక్షల నష్టం వాటిల్లిందని, ఈ నష్టం ఎవరు భర్తీ చేస్తారో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమాధానం చెప్పాలని కోరారు. ఇప్పటి వరకు జిల్లాలో జరిగిన దాడులు అన్నీ కక్షసాధింపు చర్యలేనని విమర్శించారు.

కాలువ పనులు పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

ఇల్లంతకుంట(మానకొండూర్): కాళేశ్వరం ప్రాజెక్టు 11వ ప్యాకేజీ పనుల్లో అసంపూర్తిగా ఉన్న మండలంలోని ఎల్‌ఎం 6(లెఫ్ట్ మైనర్) కాలువను శుక్రవారం జిల్లా ఇరిగేషన్ అధికారి కిశోర్, రంగనాయకసాగర్ ప్రాజెక్టు డీఈ సీతారాం పరిశీలించారు. 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దాచారం, చిన్నలింగాపురం గ్రామాల మధ్య అసంపూర్తిగా నిలిచిన కాల్వను అధికారులు పరిశీలించారు. కిలోమీటర్ మేరకు కాలువ పనులు జరగాల్సి ఉందన్నారు. అధికారులు పరిశీలిస్తున్న విషయం తెలుసుకున్న సమీప రైతులు గాదె మధుసూదన్, పయ్యావుల బాలయ్య, దుమాల రాజు, కమటం రవి, కరికె నవీన్ అక్కడికి చేరుకున్నారు. పంటలను కాపాడాలని అధికారులను వేడుకున్నారు. అయితే రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపినట్లు రైతులు చెప్పారు.

రైతు పక్షపాతి పార్టీ

- కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి రైతు పక్షపాతిగానే ఉంటుందని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్లలోని తన నివాసంలో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలోనే చాలా వ్యాపారాలకు అనుమతుల్లేకుండా నడిపించారని విమర్శించారు. కొన్ని డెయిరీలు ట్రేడ్‌లైసెన్స్, ఫైర్‌సేఫ్టీ లేకుండా నిర్వహిస్తున్నారని వాటిని మూసివేయిస్తే బీఆర్‌ఎస్ రాజకీయ రాద్ధాంతం చేస్తోందన్నారు. మూయించిన డెయిరీని రైతుల ఇబ్బంది దృష్ట్యా ఆఫీసర్లు తిరిగి తెరిపించారన్నారు. చట్టానికి వ్యతిరేకంగా నడిచే డెయిరీఫాంపై చర్యలు తీసుకుంటూనే, రైతులకు నష్టం జరగకుండా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. గత ప్రభుత్వమే పాడి పరిశ్రమను దెబ్బతీసిందన్నారు. జిల్లా గంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, ప్యాక్స్ చైర్మన్ వేల్పుల స్వరూపరెడ్డి, నాయకులు ఆకునూరి బాలరాజు, గోనె ఎల్లప్ప, బూర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అనుమతి కొంత ఆక్రమణ కొండంత!

ముస్తాబాద్ మండలం పోత్గల్ శివారులోని గుట్టల్లో ఓ స్టోన్‌క్రషర్‌కు ఐదు ఎకరాల్లో తవ్వకాలు జరిపేందుకు, బండను కొట్టి కంకర తయారు చేసేందుకు అనుమతి పొందారు. కానీ అనుమతికి మించి 10 ఎకరాల్లో గుట్టను పగులగొట్టి బండలు తీసి స్టోన్ క్రషర్‌కు వాడుకున్నారు. ప్రభుత్వ పెద్దల అండదండలతో అక్రమదందా సాగించారు. స్టోన్ క్రషర్‌లో ఉత్పత్తి చేసిన లక్షల క్యూబిక్ మీటర్ల కంకరను కాంట్రాక్టు పనులకు అప్పగించారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ.. హద్దులు దాటి గుట్టలను గుల్ల చేశారు.

ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి శివారులోని గుట్టల్లో కంకర క్వారీలోనూ అక్రమ తవ్వకాలు జరిగాయి. అనుమతి పొందిన దానికంటే అదనంగా గుట్టలను గుల్ల చేశారు. గనులశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి, కొలతలు వేసి అక్రమ తవ్వకాలు జరిగాయని నిర్ధారిస్తూ సదరు స్టోన్‌క్రషర్ యజమానికి నోటీసులు జారీచేశారు. అటవీశాఖ ఆధీనంలోని గుట్టను కొట్టి అక్రమ వ్యాపారం సాగించినట్లు నిర్ధారించారు. ఇలా రుద్రంగిలో ఒక్కటి, తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో మరొకటి ఇలా జిల్లా వ్యాప్తంగా స్టోన్‌క్రషర్లలో అక్రమ తవ్వకాలు జరిగినట్లు గనులు, భూగర్భశాఖ అధికారులు నిర్ధారించారు.

జిల్లాలో గనుల స్వరూపం ఇలా..

కలర్ గ్రానైట్ లీజులు: **24**

కంకర లీజులు : **16**

పట్టాభూములు : **40.14** హెక్టార్లు

ప్రభుత్వ భూములు : **103.43** హెక్టార్లు

ప్రభుత్వానికి ఆదాయం..

2023–2024 : రూ.**16.72** కోట్లు

2024–2025 లక్ష్యం : రూ.**18.77** కోట్లు



స్టోన్ క్రషర్లలో మైనింగ్ అధికారుల కొలతలు(ఫైల్)

- హద్దులు దాటి అక్రమ మైనింగ్
- స్టోన్‌క్రషర్లలో నలిగి'పోయిన' నిబంధనలు
- యజమానులకు రూ.127కోట్ల జరిమానా

సిరిసిల్ల: జిల్లాలో మైనింగ్ హద్దులు దాటింది. నిబంధనలు ఉల్లంఘించి పరిధి దాటి గుట్టలను గుల్ల చేశారు. యథేచ్ఛగా కోట్లు సంపాదించారు. రెవెన్యూ, గనులశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో క్వారీలు, క్రషర్ల యజమానులు తవ్వేందే గుట్ట.. కొట్టిందే బండలా మారిపోయింది. ఫలితంగా వారి దందా హద్దులుదాటి సాగింది. ఈ విషయం ఇటీవల అధికారుల పరిశీలనలో వెల్లడైంది.

2020 నుంచి యథేచ్ఛగా తవ్వకాలు

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని క్వారీలు, క్రషర్లకు డీజీపీఎస్ ద్వారా సర్వే చేసి హద్దులు నిర్ణయించి అనుమతులు జారీ చేశారు. వాటికి జియోట్యాగింగ్ చేశారు. తర్వాత పట్టించుకోకపోవడంతో వారు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించారు. ప్రభుత్వానికి సీనరేజీ, రాయల్టీ చెల్లించకుండానే అక్రమ మైనింగ్ జరిగింది. ప్రభుత్వం నిబంధనల మేరకు మైనింగ్‌శాఖ 2020లో అనుమతించిన గనులు గడువు ముగిసినా అక్రమ తవ్వకాలు సాగించారు. జిల్లాలోని 14 క్వారీలకు, 9 క్రషర్లకు గనుల శాఖ అధికారులు గడువు దాటిపోయిందని నోటీసులు జారీచేశారు. కొన్నింటిని నిషేధిత జాబితాలో పెట్టారు. కానీ అప్పటికే నష్టం జరిగింది. ప్రభుత్వం ఆదాయం కోల్పోయింది. లీజు గడువు ముగిసినా రెన్యూవల్ చేయించుకోకుండానే ఏళ్లుగా తవ్వకాలు సాగిస్తున్నారు.

నిబంధనలపై పట్టింపు కరువు

1994 ఆదేశాల మేరకు ఐదు హెక్టార్లకు మించి గనుల్లో ఖనిజాల తవ్వకాలు సాగిస్తే పర్యావరణ అనుమతులు పొందాలి. కానీ జిల్లాలో ఆ నిబంధనలు పాటించడం లేదు. జిల్లాలో రోడ్లు, భవనాల నిర్మాణాలకు అవసరమైన అన్ని సైజుల కంకర తయారీ జరగ్గా.. క్రషర్లలో నిబంధనలు పాటించకుండా.. రేయింబవళ్లు క్రషర్ జరిగింది. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన మైనింగ్ అధికారులు పలు స్టోన్ క్రషర్లకు నోటీసులు ఇచ్చారు. గనులశాఖ నోటీసులపై యజమానులు కోర్టుకు వెళ్లగా.. యథాతథా స్థితిని కొనసాగించాలని కోర్టు ఆదేశించింది. జిల్లాలోని నిబంధనలు పాటించిన స్టోన్ క్రషర్లు ఇప్పుడు నడవడం లేదు. కానీ అప్పటికే ప్రకృతికి, ప్రభుత్వానికి పూర్తిగా నష్టం జరిగిపోయింది.

నోటీసులు ఇచ్చాం



జిల్లాలో 14 క్వారీలు, 9 స్టోన్‌క్రషర్లు ఉన్నాయి. నిబంధనలు పాటించకుండా.. హద్దులు దాటి తవ్వకాలు సాగించిన వారికి నోటీసులు జారీ చేశాం. ఆయా స్టోన్‌క్రషర్లు సాగించిన అక్రమ తవ్వకాలను డిజిటల్ సర్వే ద్వారా నిర్ధారించి రూ.127కోట్ల జరిమానాలు విధించాం. కొందరు స్టోన్‌క్రషర్ యజమానులు కోర్టును ఆశ్రయించారు. స్టేటస్‌కో విధిస్తూ.. కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు ముందుకెళ్తాం.

– క్రాంతికుమార్, జిల్లా గనులశాఖ అధికారి

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల: జిల్లాలో ఇంటర్, పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇంటర్ ఫస్టియర్‌లో 5065, సెకండియర్‌లో 4245 మంది విద్యార్థులకు 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు బిగించినట్లు చెప్పారు. పదో తరగతిలో 6,768 మంది విద్యార్థులకు 36 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఆర్డీవోలు రాజేశ్వర్, రాధాబాయి, జిల్లా ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి రజిత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో 22,397 మంది పట్టభద్రులు, 950 మంది టీచరు ఓటర్లు ఉన్నారని వివరించారు. పట్టభద్రులకు 28 పోలింగ్ కేంద్రాలు, టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లకు 13 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని తెలిపారు. 181 మంది ఎన్నికల సిబ్బందిని నియమించి, శిక్షణ ఇచ్చామని వివరించారు. ఎస్పీ అఖిల్ మహాజన్, ఆర్డీవోలు రాజేశ్వర్, రాధాబాయి, డీఆర్డీవో శేషాద్రి, జెడ్పీ సీఈవో వినోద్‌కుమార్, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, సీపీవో శ్రీనివాసచారి పాల్గొన్నారు.

హన్మాజీపేట స్కూల్‌కు వజ్రోత్సవ శోభ

- నేడు, రేపు 75 వసంతాల సంబురాలు
- హాజరుకానున్న పూర్వ విద్యార్థులు



హన్మాజిపేటలోని ప్రభుత్వ పాఠశాల

వేములవాడ: హన్మాజీపేట ఊరు చెబితే సినారె.. మిద్దె రాములు.. ప్రొఫెసర్ సంకసాల మల్లేశం గుర్తుకొస్తారు. ఇంతటి మహామహులను అందించిన ఆ గ్రామంలో బడిని సైతం గుర్తుకు తెచ్చుకునే సందర్భం ఏర్పడింది. 1949లో ప్రారంభమైన సర్కారు బడి ఇప్పుడు 75 వసంతాలు పూర్తి చేసుకొని వజ్రోత్సవాలకు ముస్తాబైంది. ఎంతో మంది పూర్వ విద్యార్థుల కృషితో ఈ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. హన్మాజీపేటలోని విద్యార్థులతోపాటు మల్లారం, లింగంపల్లి, బొల్‌ల్రాం, మామిడిపల్లి, ఎన్గల్, బండపల్లి, మూడపల్లి, బావుసాయిపేట, సుద్దాల, మంగళ్లపల్లి గ్రామాల్లోని విద్యార్థులు ఇక్కడే చదువుకుని బాగుపడ్డారు. ఈ స్కూల్‌లో చదువుకున్న ఆయా గ్రామాల్లోని విద్యార్థులు శని, ఆదివారాల్లో నిర్వహించే వజ్రోత్సవాలకు హాజరుకానున్నారు. 1949 నుంచి ఇప్పటి వరకు చదివిన అన్ని బ్యాచ్‌ల విద్యార్థులు కలుసుకోనున్నారు.

వాట్సాప్ గ్రూప్‌తో ఏకతాటిపైకి

విద్యార్థులందరని వాట్సప్ వేదికగా కలిపారు. ఈ స్కూల్‌లో చదివిన ప్రతీ బ్యాచ్‌లోని విద్యార్థులతో మాట్లాడి వాట్సాప్ గ్రూప్‌లు క్రియేట్ చేసి అందరిని ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. దాదాపు 3 వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేశారు. అతిథులు ఆహ్వానం నుంచి వేదిక ఏర్పాటు వరకు ప్రతీది వాట్సాప్ గ్రూప్‌లోని పూర్వ విద్యార్థులకు సమాచారం ఇస్తున్నారు.

మూడు జనరేషన్ల పూర్వ విద్యార్థులు

75 వసంతాల వేడుకల్లో భాగంగా పాల్గొనే చాలామంది పూర్వ విద్యార్థుల్లో మూడు నాలుగు జనరేషన్లు ఉన్నాయి. ఒకే ఇంట్లో నుంచి తాత నుంచి మొదలుపెడితే మునిమనుమల వరకు ఉన్నారు. అందరూ పూర్వ విద్యార్థుల హోదాలో ఈ వజ్రోత్సవ వేడుకకు హాజరుకానున్నారు. హన్మాజీపేటలో శని, ఆదివారం సంబరం నెలకొననుంది.

మోగిన తాగునీటి గంట



బందనకల్‌లో నీరు తాగుతున్న విద్యార్థులు

ముస్తాబాద్(సిరిసిల్ల): విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ముస్తాబాద్ మండలం బందనకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నీటిగంట ప్రారంభించారు. విద్యార్థుల్లో వేసవిలో డీహైడ్రేషన్ నివారణకు నీటిగంటను ప్రవేశపెట్టినట్లు హెచ్‌ఎం రాజ్‌కుమార్ తెలిపారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా వాటర్ బాటిల్‌తో స్కూల్‌కు రావాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతర పనులు పరిశీలన

వేములవాడ: రాజన్న ఆలయంలో ఈనెల 25 నుంచి 27 వరకు జరిగే మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను రూ.2.39కోట్లతో చేస్తున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉత్సవాల కోసం చేస్తున్న ఏర్పాట్లను శుక్రవారం రాత్రి పరిశీలించారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు.

కేటీఆర్ టీస్టాల్ టేలా ఎత్తివేత

- సిరిసిల్లలో వెల్లువెత్తిన విమర్శలు



కేటీఆర్ టీస్టాల్‌ను తొలగిస్తున్న అధికారులు

సిరిసిల్లటౌన్: మూడు రోజుల క్రితం సిరిసిల్లలో ట్రేడ్ లైసెన్స్ లేదన్న సాకుతో 'కేటీఆర్ టీస్టాల్'ను సీజ్ చేసిన బల్దియా అధికారులు శుక్రవారం ఏకంగా టీస్టాల్‌ను తొలగించారు. ఈ సంఘటన స్థానికంగా విమర్శలకు తావిచ్చింది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక బతుకమ్మ ఘాట్ వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో రెండు టేలాలు ఏర్పాటు చేయగా.. ఒకదానికి బత్తుల శ్రీనివాస్ నిర్వహిస్తున్నాడు. కేటీఆర్‌పై అభిమానంతో ఆయన ఫొటోతోపాటుగా కేటీఆర్ పేరుతో హోటల్ నిర్వహిస్తున్నాడు. మూడు రోజుల క్రితం ట్రేడ్ లైసెన్స్ లేదని అధికారులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. కాగా శుక్రవారం బల్దియా అధికారులు భారీక్రేన్‌ను తీసుకొచ్చి ఆ టేలాను తొలగించారు. బాధితుడు శ్రీనివాస్ అధికారులను ఎంత బతిమిలాడినా వినిపించుకోలేదు. శ్రీనివాస్‌ను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లగా.. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర నాయకుడు బొల్లి రామ్మోహన్ వచ్చి టౌన్ సీఐతో మాట్లాడడంతో పంపించి వేశారు. అక్కడి నుంచి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతోపాటు మున్సిపల్ ఎదుట బైఠాయించాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడి 'ధర్నా చేయకు.. నీకు నేనే స్వయంగా ఖర్చులు భరించి ఉపాధికల్పిస్తాను..' అంటూ భరోసానిచ్చారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ వేరొకరికి కేటాయించిన టేలాను బత్తుల శ్రీనివాస్ అక్రమంగా నడిపిస్తున్నారని తెలిపారు. ఎన్నికల కోడ్ ప్రకారం రాజకీయ నేతల ఫొటోలు ప్రదర్శించరాదని పేర్కొన్నారు. ఈ రెండు నిబంధనలు ఉల్లంఘనతో టేలాను తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా పక్కనే గల టేలాను ఎందుకు తొలగించలేదన్న ప్రశ్నకు.. వారు ఎన్నికల కోడ్ ఉల్లంఘించలేదని వివరించారు.

పంటలు ఎండుతున్నాయి..

- ముస్తాబాద్‌లో మూడు గ్రామాల రైతుల ధర్నా



రైతులతో మాట్లాడుతున్న డీఈ రవికుమార్

ముస్తాబాద్(సిరిసిల్ల): ఆరుగాలం శ్రమించి సాగు చేస్తున్న పంటలను కాపాడేందుకు నీటిని విడుదల చేయాలని కోరుతూ మండల కేంద్రంలో పోతుగల్, గన్నెవారిపల్లె రైతులు శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ముస్తాబాద్ మేజర్ పంచాయతీ కార్యాలయంలో నీటిపారుదలశాఖ డీఈ రవికుమార్ ఆధ్వర్యంలో ముస్తాబాద్, పోతుగల్, గన్నెవారిపల్లె రైతులు సమావేశమయ్యారు. గన్నెవారిపల్లె, పోతుగల్‌లో ఎల్లమ్మ వాగు వెంబడి ఉన్న 200 ఎకరాల్లో పంట ఎండిపోయిందని రైతులు తెలిపారు. ముస్తాబాద్ పెద్ద చెరువు నీటిని విడుదల చేయాలని కోరారు. ముస్తాబాద్ పెద్దచెరువు నీటిని విడుదల చేస్తే తమ పొలాలకు నీరందదని ముస్తాబాద్ రైతులు అభ్యంతరం తెలిపారు. మల్లన్నసాగర్ నీటితో నింపిన తర్వాతే పెద్దచెరువు నుంచి నీటిని పోతుగల్‌కు విడుదల చేయాలని స్పష్టం చేశారు. దీంతో రైతుల మధ్య వాగ్వాదం జరిగింది. తమ పొలాలు కాపాడాలని పోతుగల్, గన్నెవారిపల్లె రైతులు తెలంగాణచౌక్‌లో రాస్తారోకోకు దిగారు. తహసీల్దార్ సురేశ్ రైతులను సముదాయించారు. చెరువు నీటిని విడుదల చేస్తామని, మల్లన్నసాగర్ నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

భక్తులకు అందుబాటులో వైద్యసేవలు

- జిల్లా వైద్యాధికారి రజిత



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి రజిత

సిరిసిల్ల: వేములవాడలో జరిగే మహాశివరాత్రి జాతరలో రేయింబవళ్లు వైద్యసేవలు అందించాలని, సెలవులు తీసుకోకుండా.. అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యాధికారి ఎస్.రజిత కోరారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా వైద్యసిబ్బందితో శుక్రవారం సిరిసిల్లలో సమావేశమయ్యారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు అనారోగ్య సమస్యలు ఎదురైతే వెంటనే ఫస్ట్ ఎయిడ్ చికిత్స అందించాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు నిబద్ధతతో ఆరోగ్య సేవలు అందించాలన్నారు. షిఫ్టులవారీ గా విధుల్లో ఉంటూ సేవలందించాలని కోరారు. మహాశివరాత్రి జాతర క్యాంప్ ఆఫీసర్ వైద్యులు సంపత్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు రామకృష్ణ, అనిత, దివ్యశ్రీ, డిప్యూటీ డెమో రాజ్‌కుమార్, సీహెచ్‌వోలు బాలచంద్రం, బాలయ్య, లింగం పాల్గొన్నారు.

30 ఏళ్లు పైబడిన వారికి వైద్యపరీక్షలు

జిల్లాలో 30 ఏళ్లు పైబడిన వారికి బీపీ, షుగర్ వైద్యపరీక్షలు చేస్తున్నట్లు వైద్యాధికారి రజిత తెలిపారు. ఈమేరకు క్షేత్రస్థాయిలో వైద్యసిబ్బంది ఇంటింటి సర్వేలు చేస్తూ అసంక్రమిత వ్యాధుల(ఎన్‌సీడీ) పరీక్షలు చేయాలన్నారు. జిల్లాలో ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో ఆశకార్యకర్తలు, ఏఎన్‌ఎంలు గ్రామాల్లో పరీక్షలు చేయాలన్నారు. ఈమేరకు జిల్లాలోని చందుర్తి, బోయినపల్లి, కొదురుపాకల్లో వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహించారు. ప్రజలు ఉచిత వైద్యపరీక్షలకు సహకరించాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ కోరారు.

కాంగ్రెస్‌తోనే పట్టభద్రులకు సంక్షేమం

- సిరిసిల్లలో అత్యధిక ఓట్లు సాధిస్తాం
- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



విలేకరులతో మాట్లాడుతున్న బల్మూరి వెంకట్

సిరిసిల్లటౌన్: శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినే పట్టభద్రులు బలపర్చాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పేర్కొన్నారు. సిరిసిల్లలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని పట్టభద్రుల ఓటర్ల వద్దకు తమ కార్యకర్తలు వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఈ ఏడాదిలో చేపట్టిన సంక్షేమ పథకాలు వివరిస్తున్నారన్నారు. పక్కా ప్రణాళికతో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్, కేంద్రంలో బీజేపీలు ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. తమ పార్టీ వచ్చిన వెంటనే 50 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదన్నారు. తమ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామన్న ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, ఏఎంసీ చైర్మన్ వెల్మల స్వరూపరెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత పాల్గొన్నారు.

బీజేపీకి ఓటు అడిగే హక్కు లేదు

సిరిసిల్లటౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులను ఓటు అడిగే హక్కు బీజేపీకి లేదని సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి విమర్శించారు. సిరిసిల్లలోని ఆర్‌ఎంపీ భవనంలో ఆర్‌ఎంపీలతో సమావేశమయ్యారు. కుడికాల రవికుమార్, తిరుపతిరెడ్డి, నళినీకాంత్, గౌతమ్, శ్రీనివాస్, దాసి రాజమల్లు, బోగ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పట్టభద్రులకు కాంగ్రెస్ అండ

వేములవాడ: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని విప్ ఆది శ్రీనివాస్ కోరారు. బార్ అసోసియేషన్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పట్టభద్రులతో సమావేశమయ్యారు. అన్నివర్గాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, 55వేల ఉద్యోగాలు కల్పించామన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీతో లోపాయకారి ఒప్పందం చేసుకుందని విమర్శించారు.

2,464 మంది పిల్లలకు కంటి పరీక్షలు

- డీసీహెచ్‌ఎస్ పెంచలయ్య



వేములవాడలో పిల్లలకు కంటి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో రాష్ట్రీయ బాల్ స్వస్థ కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే)లో మొబైల్ హెల్త్ బృందం కంటి సమస్యలు ఉన్న 2464 మంది పిల్లలను గుర్తించిందని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పి.పెంచలయ్య శుక్రవారం తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కంటి పరీక్షలు చేసినట్లు వివరించారు. అవసరమైన వారికి అద్దాలు, మందులు అందజేస్తామని తెలిపారు. వేములవాడలో మార్చి 20 వరకు కంటిపరీక్షలు జరుగుతాయన్నారు. ఆర్‌బీకేఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నయీమ్ జహా, కంటి వైద్య నిపుణులు రత్నమాల, వైద్యులు ప్రభాకర్, అభినయ రాణి, ఫార్మసిస్ట్ సంధ్యారాణి, ఏఎన్‌ఎం దివ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైబర్ నేరానికి పాల్పడిన యువకుడి అరెస్ట్

మెట్‌పల్లి(కోరుట్ల): మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన మామిడాల నితీశ్‌కుమార్‌ను నమ్మించి రూ.6లక్షలు కాజేసిన షణ్ముఖ కృష్ణయాదవ్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ కథనం ప్రకారం ..ఉన్నత చదువుల కోసం నితీశ్‌కుమార్ లండన్ వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తుండగా.. కృష్ణయాదవ్ టెలిగ్రామ్ యాప్ ద్వారా మెసేజ్ పంపి అతన్ని పరిచయం చేసుకున్నాడు. తాను లండన్‌లో ఉద్యోగం చేస్తున్నానని, ఇండియా డబ్బులతో ఫీజు కడితే ఎక్కువ ఖర్చు అవుతోందని చెప్పాడు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో ఉన్న తన బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ చేస్తే, తాను లండన్ కరెన్సీతో ఫీజు చెల్లించి రశీదు పంపుతానని నమ్మబలికి అతడి ఖాతా వివరాలు పంపాడు. అనంతరం నితీశ్‌కుమార్ వెంటనే తన ఖాతా నుంచి రూ.25వేలు, తన తల్లి ఖాతా నుంచి రూ.5.75లక్షలను కృష్ణయాదవ్ ఖాతాలో జమ చేశాడు. తర్వాత కొన్ని రోజులకు రశీదు గురించి అడిగితే పంపకుండా సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. మోసపోయాయని గ్రహించిన నితీశ్‌కుమార్ మల్లాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, గతేడాది మేలో కేసు నమోదు చేసి ఇమ్మిగ్రేషన్ అధికారులకు సమాచారమిచ్చారు. ఆ తర్వాత లండన్ వెళ్లిన నితీశ్‌కుమార్, అక్కడ అతని గురించి వెతకగా ఆచూకీ దొరకలేదు. గురువారం ఉదయం లండన్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దిగిన కృష్ణయాదవ్‌ను ఇమ్మిగ్రేషన్ అధికారులు పట్టుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మల్లాపూర్ ఎస్సై రాజు అక్కడకు వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకొని మెట్‌పల్లికి తరలించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరుస్తామని సీఐ పేర్కొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



శంకర్ (ఫైల్)

పాలకుర్తి(రామగుండం): అనారోగ్యం బాధ భరించలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై స్వామి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రావుల శంకర్(60) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నెలక్రితం ఆపరేషన్ కూడా చేయించుకున్నాడు. అయినా ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం అర్ధరాత్రి ఇంటి ఎదుట చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

గూడెంలో పీజీ విద్యార్థి..



దామోదర్ (ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): గూడెం గ్రామానికి చెందిన గూడ దామోదర్(30) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. దామోదర్ కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తిచెంది ఇంట్లోని పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్సై వివరించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

జూలపల్లి(పెద్దపల్లి): కుమ్మరికుంట గ్రామానికి చెందిన దొడ్ల లచ్చయ్య(58)బావిలో మునిగి మృతి చెందాడు. ఎస్సై సనత్‌కుమార్, మృతుడి భార్య కనుకమ్మ కథనం ప్రకారం.. శుక్రవారం ఉదయం చేనుకు నీళ్లు పెట్టేందుకు వెళ్లిన లచ్చయ్య.. బావిలో విద్యుత్ మోటారు పైపు సరిచేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. అయితే, బావిలో ఉన్న తీగెలు తట్టుకునిపైకి రాలేక నీళ్లలో మునిగి ఊపిరి ఆడక మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఒడిశా టు మహారాష్ట్ర

- సీలేరు నుంచి మంచిర్యాల
- రాష్ట్ర హద్దులు దాటుతున్న గంజాయి
- యువతే టార్గెట్‌గా జోరుగా వ్యాపారం

ఏడాది	గంజాయి (కేజీల్లో)	విలువ (రూ.లక్షల్లో)	నిందితులు
2020	32.90	6.89	22
2021	34.48	3.70	14
2022	8.52	1.22	58
2023	34.78	7.76	58
2024	21.83	5.36	74
2025 (ఇప్పటివరకు)	120.27	60.13	16



పట్టుబడిన గంజాయి వాహనాలు (ఫైల్)

గోదావరిఖని: గంజాయి రాష్ట్రాల సరిహద్దులు దాటుతోంది.. ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి మహారాష్ట్రకు తరలివెళ్తోంది. సీలేరు నదీతీరం నుంచి మంచిర్యాలకు రవాణా అవుతోంది. పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా రవాణా ఆగడంలేదు. ఉజ్వల భవిష్యత్ ఉన్న యువత గంజాయి మత్తులో జోగుతోంది. కోవర్ట్‌లు ఇచ్చిన సమాచారంతో రామగుండం కమిషనరేట్ పోలీసులు ఒకేరోజు రూ.60లక్షల విలువైన 120కిలోల గంజాయి పట్టుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది.

కాపుకాసి 96 కిలోలు పట్టివేత

ఒడిశా సరిహద్దుల నుంచి మంథని మీదుగా గంజాయి రవాణా అవుతున్న సమాచారం పోలీసులకు చేరింది. రంగంలోకి దిగగిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు జీడీకే-11గని వద్ద మాటు వేశారు. ఈక్రమంలోనే రెండు వాహనా అక్కడకు రాగానే ఆపి తనిఖీ చేశారు. దీంతో అందులో గంజాయి ప్యాకెట్లు లభించాయి. నిందితులతో పాటు గంజాయి, రెండు కార్లను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరు పర్చారు.

సీసీ కెమెరాల ముసుగులో దందా..

ఒడిశా, ఆంధ్రా సరిద్దుల్లో సీలేరు నది ప్రవహిస్తోంది. దాని పరీవాహక ప్రాంతంలోని ఒడిశా అటవీ ప్రాంతంలో గంజాయి సాగుచేస్తూ ఇతర ప్రాంతాలకు తరలించడం కొన్నేళ్లుగా సాగుతోందని పోలీసులు చెబుతున్నారు. ఈక్రమంలో మంచిర్యాలకు చెందిన కొందరు ముఠాగా ఏర్పడి అక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసి తీసుకొస్తున్నారు. ఈ క్రమంలోనే కారు వెంట రెండు మోటార్ సైకిళ్లు ఎస్కార్ట్‌గా రాగా ఒడిశా సీలేరు టు బీజాపూర్, మేడారం, మంథని, గోదావరిఖని మీదుగా మంచిర్యాలకు గంజాయి తరలించారు. సీసీ కెమెరాలు విక్రయించే గోడౌన్‌లో దానిని దాచి ఉంచారు. తీసుకొచ్చింది 30 కిలోల గంజాయిలో 6.5 కిలోలు వినియోగం కాగా మిగతాదానిని మంచిర్యాల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నిందితులంతా యువకులే..

తక్కువ డబ్బుతో ఎక్కువ మత్తు వస్తున్న గంజాయి వైపు యువత మొగ్గు చూపుతోంది. ఈక్రమంలో చాలామంది గంజాయి మత్తులో జోగుతూ తమ లక్ష్యాలు, ఉన్నత చదువులను వదిలేస్తున్నారు. మంచిర్యాల గోడౌన్‌లో గంజాయి దాచిఉంచిన సంఘటనలో 11మంది పోలీసులకు పట్టుబడగా వారిలో 25ఏళ్ల వారే ఎక్కువగా ఉన్నారు. అలాగే ఇంకా పోలీసులకు చిక్కని 11మందిలో కూడా యువకులు ఉన్నట్లుగా పోలీసులు చెబుతున్నారు. వీరిలో ఒకరు మైనర్ కూడా ఉన్నారని అంటున్నారు.

పీడీయాక్ట్ నమోదు చేస్తాం



గంజాయి వ్యవహారంలో ఎంతటివారున్నా ఉపేక్షించబోం. గంజాయి తాగినా, అమ్మినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. నిందితులపై పీడీయాక్టు నమోదు చేస్తున్నాం.

– శ్రీనివాస్, పోలీసు కమిషనర్ రామగుండం

రాజన్న లడ్డూ సిద్ధం



లడ్డూ తయారు చేస్తున్న కార్మికులు



ట్రేలో రాజన్న లడ్డూలు

- భక్తుల కోసం తయారీ
- రూ.20కి ఒకటి
- వేములవాడలో 25 నుంచి మహాశివరాత్రి జాతర
- 4 లక్షల భక్తులు వస్తారని అంచనా

వేములవాడ: కోరిన కోర్కెలు తీరుస్తూ ... కొంగు బంగారంగా నిలుస్తున్న వేములవాడ రాజన్న లడ్డూ ప్రసాదానికి భక్తుల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. రాజన్న దర్శనం అనంతరం లడ్డూ ప్రసాదాన్ని కొనుగోలు చేసి తీసుకెళ్లి బంధువులు, చుట్టూ పక్కల వారికి ఇవ్వడం ఆనవాయితీగా భావిస్తారు. లడ్డూ ప్రసాదం పంపిణీ చేయడం ఆధ్యాత్మిక భావనను విస్తరించడంతోపాటు ప్రసాదాన్ని తీసుకున్న వారు సైతం చాలా పవిత్రంగా భావిస్తూ స్వీకరిస్తారు. ఇంత ప్రాశస్త్యం గల లడ్డూ ప్రసాదాన్ని ఆలయ అధికారులు యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేయిస్తున్నారు. వేములవాడ రాజన్న ఆలయంలో ఈనెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు 4 లక్షల వరకు భక్తుఉల వస్తారని అంచాన వేశారు. ఇందుకు అనుగుణంగా దాదాపు 5 లక్షల లడ్డూలను తయారీ చేయిస్తున్నారు. ఇప్పటికే 3 లక్షల లడ్డూలు సిద్ధం చేసి ఉంచగా, మరో 2 లక్షల లడ్డూలను సిద్ధం చేస్తున్నారు. రూ.20కి ఒక లడ్డూ చొప్పున విక్రయిస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొన్ని ఆంధ్రాబ్యాంక్ భవనంలో అదనంగా లడ్డూ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. రాజన్నను దర్శించుకుని దక్షిణ ద్వారం ద్వారా బయటకు వెళ్లే భక్తులు నేరుగా ప్రసాదాల కౌంటర్‌కు చేరుకోవచ్చు.

ఏటా పెరుగుతున్న ఆదాయం

2014-2015	రూ.7.30 కోట్లు
2015-2016	రూ.8.89 కోట్లు
2016-2017	రూ.8.38 కోట్లు
2017-2018	రూ7.88కోట్లు
2019-2020	రూ.6.95 కోట్లు
2020-2021	రూ.11.42 కోట్లు
2021-2022	రూ.11.46 కోట్లు
2022-2023	రూ.11.50 కోట్లు
2023-2024	రూ.11.60 కోట్లు

5 లక్షల లడ్డూలు

జాతరకు వచ్చే భక్తులకు రాజన్న ప్రసాదం అందుబాటులో ఉంచాలన్న ఉద్దేశంతో ఈసారి 5 లక్షల లడ్డూలు సిద్ధం చేయిస్తున్నాం. ఇప్పటికే 3 లక్షల లడ్డూలు రెడీ అయ్యాయి. జాతర సందర్భంగా మరిన్ని కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు.

– శ్రవణ్, ఏఈవో, గోదాం ఇన్‌చార్జి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చూపాలి

- బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

సాక్షి,పెద్దపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని, స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించే బాధ్యత తాము తీసుకుంటామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం బీజేపీ పచీస్ ప్రభారి (25 మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జి) సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. జిల్లాలోనూ గుజ్జుల రామకృష్ణారెడ్డి, దుగ్యాల ప్రదీప్‌రావు, కాసిపేట లింగయ్య, కోమల ఆంజనేయులు లాంటి నేతలను చంపాలని నక్సలైట్లు పోస్టర్లు కూడా వేశారని, నక్సలైట్స్‌కు ఎదురొడ్డిన ఆ నేతలు కాషాయ జెండాను రెపరెపలాడించారని గుర్తుచేశారు. హిందువుల జాబితాలో ముస్లింలను ఎలా కలుపుతారని ప్రశ్నించారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి బిల్లు పంపితే కేంద్రప్రభుత్వం ఆమోదించే ప్రసక్తే లేదన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు లేకపోతే నాయకులు లేరని, కార్యకర్తల కష్టంతోనే ఇద్దరు సీఎంలను ఓడించానన్నారు. మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, కాసిపేట లింగయ్య, గుజ్జుల రామకృష్ణారెడ్డి, బీజేపీ టీచర్స్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్క కొమరయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఫ్లెక్సీలో నా ఫొటో ఎక్కడ?

అంతకుముందు జరిగిన మీడియా సమావేశంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తన ఫొటో లేదని బీజేపీ నేత గోమాసె శ్రీనివాస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తనకు గౌరవం తగ్గిదని జిల్లా అధ్యక్షుడిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పొరపాటు జరిగిదంటూ సంజీవరెడ్డి సర్దిచెప్పారు.

దుగ్యాల వర్గం దూరం..

బండి సంజయ్ పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్, పచ్చీస్ ప్రభారీకి పెద్దపల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి దుగ్యాల ప్రదీప్‌రావు వర్గం దూరంగా ఉండటంతో కమలం పార్టీలో గ్రూప్ రాజకీయాలు మరోసారి బయటపడ్డాయి. తమను పట్టించుకోవడం లేదని, అసంతృప్తితోనే సమావేశంకు దూరంగా ఉన్నామని దుగ్యాల వర్గం నేతలు చెబుతున్నారు.

పట్టభద్రుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- మంత్రి శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

ధర్మపురి: పట్టభద్రుల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ధర్మపురిలోని బ్రాహ్మణ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నిరుద్యోగుల నైపుణ్యాన్ని పెంచేలా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రారంభించామని పేర్కొన్నారు. విద్యారంగ అభివృద్ధి, పట్టభద్రుల సమస్యలను తీర్చే బాధ్యత కాంగ్రెస్‌దేనని గుర్తుచేశారు. అంతకముందు విప్ అడ్లూరి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే పట్టభద్రుల సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. ఉద్యోగాలకు కల్పతరువుగా ఉన్న ధర్మపురిలో శ్రీలక్ష్మీనృసింహ సంస్కృతాంధ్ర కళాశాలను మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో ముఖ్యమంత్రితో మాట్లాడి తెరిపించానని వివరించారు. రానున్న రోజుల్లో ధర్మపురిలో ఐటీఐ, డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిలుముల లావణ్య, నాయకులు ఎస్.దినేశ్, వేముల రాజు, చిలుముల లక్ష్మణ్, చీపిరిశెట్టి రాజేశ్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్



వైశ్యభవన్‌లో జరిగిన బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న పురందేశ్వరి

- పెట్టుబడుల సాధనే లక్ష్యంగా రూపకల్పన
- ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి

కరీంనగర్‌టౌన్: వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, పార్లమెంటు సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి పేర్కొన్నారు. కరీంనగర్‌లోని వైశ్య భవన్‌లో శుక్రవారం కేంద్ర బడ్జెట్‌పై నిర్వహించిన మేధావుల సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు స్థానిక శ్వేతా హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులపై అవగాహన కల్పించేందుకే పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా కేటాయింపులు ఉన్నాయన్నారు. రక్షణ, విద్య, వైద్యం, వ్యవసాయం, స్కిల్ డెవలప్‌మెంట్స్‌కు ప్రాధాన్యం ఇచ్చినట్లు పేర్కొన్నారు. రూ.12లక్షల వరకు ఇన్‌కమ్ ట్యాక్స్ లేదన్న ప్రకటన కోట్లాదిమందికి సంతోషాన్నిచ్చిందని గుర్తు చేశారు. గరీబీ హటావో నినాదంతో దేశాన్ని దశాబ్దాలు ఏలిన కాంగ్రెస్ పేదరికాన్ని నిర్మూలించలేక పోయిందని విమర్శించారు. గత పదేళ్ల మోదీ ప్రభుత్వ పాలనలో సాధించిన అభివృద్ధి, సంస్కరణలతో దాదాపు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అభివృద్ధి మందగించిన భారత్ మెరుగైన పనితీరు సాధించిందన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, బలహీన వర్గాలు, దళిత, గిరిజన, మైనార్టీ, నిరుద్యోగుల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలను తీసుకొచ్చి చేయూతనిస్తోందన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, వికసిత్ భారత్ బడ్జెట్ ప్రోగ్రాం స్టేట్ కోఆర్డినేటర్ గంగిడి మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్‌రావు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వివాహిత ఆత్మహత్య

ముస్తాబాద్(సిరిసిల్ల): ఫైనాన్స్ వారి వేధింపులు..అప్పుల బాధలు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాలు మృతురాలు సూసైడ్ నోట్‌లో పేర్కొంది. ముస్తాబాద్ ఎస్సై గణేశ్, గ్రామస్తులు తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు చెందిన గట్ల సునీత(45) శుక్రవారం ఉరివేసుకుంది. భర్త నగేశ్‌తో కలిసి సునీత హోటల్ నడిపేది. హోటల్‌లో పనిచేస్తూ ఇంటికి వెళ్లివస్తానని చెప్పి వెళ్లిన సునీత తిరిగి రాలేదు. దీంతో భర్త నగేశ్ ఇంటికి వెళ్లి చూడగా.. సునీత ఉరికి వేలాడుతూ కనిపించింది. సునీతకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. సునీత చనిపోయే ముందు తన ఆత్మహత్యకు అప్పుల ఇచ్చిన వారి వేధింపులే కారణమని రాసిన సూసైడ్‌నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతురాలి భర్త నగేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలూ.. నన్ను క్షమించండి

అమ్మ శ్రీవాణి, బబ్లూ నాన్న మీరంటే నాకెంతో ఇష్టం.. నన్ను క్షమించండి అంటూ సునీత సూసైడ్ నోట్‌లో పేర్కొంది. ఒక తల్లిగా మీ మంచి చెడ్డలు చూడాల్సిన నేను అవమానభారంతో చనిపోతున్న. మీరిద్దరు నాకు ప్రాణం. నా మనసంతా మీ మీదనే ఉంటది. నన్ను క్షమించండి ఇట్లు మీ అమ్మ అంటూ సునీత ఎంతో బాధతో సూసైడ్‌నోట్ రాసింది. నడిపి అక్క, పెద్దక్క, అమ్మ నా పిల్లలిద్దరిని మన ఊరికి దయచేసి తీసుకెళ్లండి అంటూ సునీత అందులో పేర్కొంది. సునీత రాసిన లేఖను చదివిన వారు కంటతడి పెట్టారు. పోలీసులు సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు.

'ఆదివాసీల జీవనాన్ని దెబ్బతీస్తున్న ఆపరేషన్ కగార్'



మాట్లాడుతున్న విమలక్క

గోదావరిఖని: ఛత్తీగఢ్‌లో ఆదివాసీల జీవనాన్ని దెబ్బతీసేలా కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిందని అరుణోదయ రాష్ట్ర నాయకురాలు విమలక్క విమర్శించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆదివాసుల పొట్టకొట్టి అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడం కోసమే ఆపరేషన్ కగార్ కొనసాగుతోందన్నారు. అడవులను కాపాడుకోవడం కోసం ఆదివాసీలు చేస్తున్న పోరాటం న్యాయమన్నారు. నక్సలైట్లు ఆదివాసులు, అడవులకు అండగా ఉంటున్నారని అన్నారు. బహుళజాతి సంస్థలకు రెడ్‌కార్పెట్ పరిచేందుకు ఆపరేషన్ కగార్ కొనసాగుతోందని ధ్వజమెత్తారు. నక్సలైట్లను ఏరిపారేయడం కోసమంటూ కేంద్రప్రభుత్వం మొదలుపెట్టిన ఆపరేషన్ కగార్ బూటకమన్నారు. నిజమైన దేశభక్తులు విప్లవ కారులేనని విమలక్క అన్నారు. వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో సింగరేణి పోరాటం ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణతో కార్మికులు సమస్యలతో సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు మాతంగి రాయమల్లు, మేకల పోచమల్లు, జి.రాములు, వెలుతురు సదానందం, రత్నకుమార్, పల్లె లింగయ్య, యాకూబ్, చిన్నయ్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పది రోజుల్లో కూతురి పెళ్లి.. అంతలోనే విషాదం

- ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మహిళ మృతి



అంజమ్మ(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): పది రోజుల్లో పెళ్లి భాజభజంత్రీలు మోగాల్సిన ఇంటిలో చావుడప్పు వినిపించింది. ఇంటిల్లిపాది పెళ్లి పనుల్లో ఆనందంగా ఉన్న ఆ కుటుంబంలో అంతులేని విషాదం నిండింది. ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పెళ్లి కూతురు తల్లి మృతిచెందడంతో ఆ ఊరిలో విషాదం అలుముకుంది. ముస్తాబాద్ ఎస్సై గణేశ్, గ్రామస్తులు తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు చెందిన చిన్ని అంజమ్మ(52) శుక్రవారం ఉదయం ఇంటి ఆవరణలో చెత్తకు నిప్పు పెడుతుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకుంటున్నాయి. గమనించిన కుటుంబ సభ్యులు అంజమ్మను సిరిసిల్లలోని జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందింది. అంజమ్మ పెద్దకూతురు భాగ్య వివాహం మార్చి 2న ఉంది. పెళ్లికార్డులు బంధువులకు ఇచ్చేందుకు అంజమ్మ భర్త బాల్‌రెడ్డి వెళ్లాడు. పది రోజుల్లో వివాహం జరగాల్సిన ఇంటిలో విషాదం అలుముకుంది. సంఘటన స్థలాన్ని ఎస్సై గణేశ్ పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



శివయ్యా... దండాలయ్యా

వేములవాడ: రాజన్నను శుక్రవారం 20వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు సరిపడా సౌకర్యాలు కల్పించారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు కుటుంబ సభ్యులతో కలసి మొక్కుకున్నారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. ప్రసాదాలు కొనుగోలు చేసి అనుబంధ ఆలయాలను సందర్శించారు. భక్తుల ద్వారా రూ.18 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

రజనీశ్రీ సాహిత్య పురస్కారానికి కవితా సంకలనాల ఆహ్వానం

కరీంనగర్‌కల్చరల్: జాతీయ సాహిత్య పరిషత్ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో నాట్యాచార్యుడు రజనీశ్రీ పేరుపై రజినీశ్రీ కుమారుడు, మహాత్మా జ్యోతీ బాపూలే రెసిడెన్షియల్ పాఠశాలల సంయుక్త కార్యదర్శి జీవీ శ్యాంప్రసాద్‌లాల్ ఏటా రజినీశ్రీ పురస్కారం ప్రదానం చేస్తున్నారు. ఈ సంవత్సరం పురస్కారం కవిత్వానికి అందిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గాజుల రవీందర్, నందిని శ్రీనివాస్ తెలిపారు. పురస్కారం కింద ప్రశంసాపత్రం, రూ.10,016 అందజేస్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన కవులు, రచయితలు జనవరి 2022 నుంచి డిసెంబరు 2024 వరకు ముద్రితమైన తమ పద్య, గేయ, వచన కవితల సంకలనాలు మాత్రమే పంపాల్సి ఉంటుంది. శతకాలు, దీర్ఘ కవితలు, లఘురూప ప్రక్రియలు స్వీకరించరు. ప్రతీది నాలుగు ప్రతులను మార్చి 20లోపు గాజుల రవీందర్ ఇంటి నెం.8-3-255/1, రామచంద్రాపూర్ కాలనీ, రోడ్ నెం.12, భగత్ నగర్, కరీంనగర్, 505001 చిరునా మాకు పంపాలని సూచించారు. వివరాలకు 94904 01861 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.